క్లుప్తంగా

తిరుమలలో సంకాపురం భజన మండలి సభ్యులు



అయిజ: మండలంలోని సంకాపురంలోని విజయరాయ భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం ఆహ్వానం మేరకు తిరుమలలో జరిగే అఖండ హరినామ సంకీర్తనలో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు స్వామి వారి కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు పెద్ద తిమ్మప్ప, వెంకటేష్, ఉరుకుందు, నరసింహులు, నర్సిహ చారి, వెంకట్రాములు, చిన్న, తిమ్మప్ప, రామలింగం, నాగరాజు, రాముడు, నర్సన్న, పవన్, వీరశేఖర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభం



ధరూరు: మండల పరిధిలోని పెద్దపాడులో కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సెర్ప్ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టేందుకు మహిళా శక్తి సంఘం సభ్యులు కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలి

రాజోళి: ప్రస్తుతం ఈదురుగాలులు వీస్తున్న క్రమంలో విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఎంపీపీ మరియమ్మ సూచించారు. అక్కడక్కడా వర్షాలు కురుస్తూ, గాలులు వీస్తుండటంతో తీగలు తెగిపోవడం, ఇతర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. ప్రజలు వాటిని గమనించక ప్రాణాల మీదకు తెచ్చుకుంటారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలు విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలని, సొంతంగా పని చేసేందుకు సాహసించకూడదన్నారు. ఆమెతో పాటు నతానియేల్, వెంకటేశ్వర్లు, నాగేష్ ఉన్నారు.

ఆరాధనతో ధర్మ స్థాపన



శాంతినగర్: మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి బింగిదొడ్డి అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో ప్రబోధ సేవాసమితి బింగిదొడ్డి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. కార్యక్రమంలో బింగిదొడ్డి కమిటీ సభ్యులు ఈరన్న, వెంకటేష్, జయమ్మ, రామచంద్ర, నరసమ్మ, పద్మమ్మ, జమ్ములమ్మలు పాల్గొన్నారు.

రోడ్డుపై చెట్టుకొమ్మలను తొలగించండి



మానవపాడు: మండల కేంద్రంలో ప్రధాన రహదారి నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డుపై చెట్టు కొమ్మలు అడ్డుగా ఉన్నాయని, వాహనదారులకు, ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యుత్ అధికారులు తీగలకు అడ్డుగా ఉన్నాయని చెట్టు కొమ్మలను నరికి రోడ్డుపై పడేశారు. వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా సంబంధిత అధికారులు స్పందించి కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఒరిగిన విద్యుత్ స్తంభాలు



మానవపాడు: మానవపాడు నుంచి చెన్నిపాడు మీదుగా వెళ్లే రహదారి పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు ఒరిగి ఎప్పుడు ప్రమాదం సంభవించునోనని ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులకు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సాగుకు సన్నద్ధం

- పంట పొలాలు దున్నుతున్న రైతులు
- సకాలంలో దుక్కులు సిద్ధం చేస్తేనే సత్ఫలితాలు
- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

వరుణుడు కరుణించి, చినుకు పలకరించడంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. నిన్నమొన్నటి వరకు నెర్రలు చాచిన భూములు భారీ వర్షంతో పదునెక్కాయి. ఈ సారి వర్షాలు కురుస్తాయో లేదో అనే సందిగ్ధంలో ఉన్న ఉన్న అన్నదాతకు మండుటెండల్లో సైతం భారీ వర్షం కురిసి జీవం పోసింది. మరోవైపు జూన్ మొదటి వారంలో రుతుపవనాలు పలకరిస్తాయని వాతావరణశాఖ ముందస్తు సమాచారం ఇవ్వడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పత్తి విత్తనాలు విత్తేందుకు పొలం సిద్ధం చేయిస్తున్న రైతు

కేటీదొడ్డి: సాధారణంగా రైతులు వేసవిలోనే దుక్కులు సిద్ధం చేస్తారు. కానీ నవంబర్ నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో వేసవిలో దుక్కులు దున్నేందుకు నేల సహకరించలేదు. కరువు వస్తుందన్న ఆందోళనలో ఉన్న అన్నదాతలో భారీ వర్షంతో ప్రాణంలేచి వచ్చింది. నేల పూర్తిగా పదునెక్కింది. ఈ సమయంలో సాగుకు సన్నద్ధమై దుక్కులు సిద్ధం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారు లు చెబుతున్నారు. సిద్ధంగా ఉన్న దుక్కులపై జూన్ మొదటి వారంలో రుతుపవనాల ప్రభావంతో మంచి వర్షాలు కురిస్తే సకాలంలో మొక్కజొన్న, పత్తి విత్తనాలు విత్తుకునేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

విత్తనాల సేకరణ ముఖ్యం..

మండలంలో వానాకాలం పత్తి 6 వేల ఎకరాలు, వరి, తదితర పంటలు 13 వేల ఎకరాల్లో పంటలు సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత సమృద్ధిగా కురవడం, చెరువులోకి వరదనీరు అక్కడక్కడ చేరుకోవడం, భూగర్భ జలాలు క్రమంగా పెరగడంతో సాగుపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. దీంతో ఓ వైపు దుక్కులు సిద్ధం చేస్తూనే విత్తనాల సేకరణపై దృష్టి సారించారు. అన్నదాతలు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని విత్తనాలు ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి. కంపెనీ విత్తనాలు కొనుగోలు చేయడంతో పాటు, వ్యాపారుల నుంచి కొనుగోలు చేస్తే లోటుపాట్లు ఎదురైనా పక్షంలో సకాలంలో వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేసి సత్వర న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుంది. నకిలీ విత్తనాల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలి.

విత్తన విక్రయాలు..

ప్రస్తుత వానాకాలానికి అవసరమైన విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పత్తి విత్తనాలు ధరలతో స్వల్ప పెరుగుదల ఉందని విత్తన విక్రయ వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వానాకాలనికి అవసరమైన విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో ఈ నెల 20 వరకు విక్రయించాలని డీలర్లను ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగుకు సిద్ధమైన అన్నదాత విత్తనాల సేకరణలో ఒక అడుగు ముందుకేసి డీలర్లను ముందస్తుగా సంప్రదించి తమకు అవసరమైన విత్తన సంచుల వివరాలు తెలిపి బుక్ చేసుకుంటున్నారు.



ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న యువకుడు

అందుబాటులో విత్తనాలు..

ప్రస్తుత వానాకాలానికి అవసరమైన పత్తి, మొక్కజొన్న విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిసిన వెంటనే దుక్కులు సిద్ధం చేస్తే మేలు, జూన్ మొదటి వారంలో కురిసే వర్షాలకు విత్తనాలు విత్తుకుంటే మంచి దిగుబడి వస్తుంది.

– మహాలక్ష్మి, ఏఓ, కేటీదొడ్డి

కలిసికట్టుగా పోరాడుదాం



అఖిలపక్ష కమిటీ సమావేశానికి హాజరైన సభ్యులు

అయిజ: సమస్యలు పరిష్కారమయ్యే వరకు కలిసికట్టుగా పోరాడుదామని అఖిలపక్ష కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. ఆదివారం పట్టణంలోని పట్టణంలోని రెడ్డి కమ్యూనిటీ హాల్లో అఖిలపక్ష కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడారు. పట్టణంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తయినా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికాలేదని, వెంటనే పూర్తిచేయాలని నెల రోజులుగా పోరాటం చేస్తున్నా, పనులు నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు. అధికారులు, కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేయకుంటే పనులు ముందుకు సాగడం లేదన్నారు. పులికల్ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్ కోసం అలుపెరుగని పోరాటం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు అందజేత



ఉండవెల్లిలో క్రికెట్ గెలుపొందిన విజేతలు



కబడ్డీ విజేతకు నగదు అందజేస్తున్న దాతలు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఈదమ్మ జాతర సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు నగదు ప్రదానం చేశారు. మొత్తం 54 టీములు పాల్గొనగా మొదటి బహుమతి ఉండవెల్లి షాకీర్ టీం(షకిల్ లెవెన్స్) రూ.50 వేలు గెలుచుకోగా, దాత రేఖ వెంకటేశ్వర్లుగౌడు అందజేశారు. రెండో బహుమతి ఉండవెల్లి ఛత్రపతి శివాజీ రిషీ టీం రూ.30 వేలు నగదును దాత తుముకుంట రెడ్డి అందజేశారు. మూడో బహుమతి ఉండవెల్లి మధుకుమార్ టీం రూ.15 వేల నగదును దాత దయాకర్ ట్రేడర్స్ వారు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ వర్ధరాజులు, హనీఫ్, బాషా, విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు సంఘం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు..

మండలంలోని తక్కశిల గ్రామంలో ఉమారామలింగేశ్వర స్వామి జాతర సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొదటి విజేతగా బీంపురం జట్టుకు రూ.30 వేల నగదును దాత మల్లికార్జున్ యాదవ్ అందజేశారు. రెండో విజేతగా మూలమల్ల జట్టుకు రూ.20 వేలు దాత ఈదన్న అందజేశారు. మూడో బహుమతి గద్వాల్ జట్టుకు రూ.15 వేలు దాత స్వాములు అందజేశారు. నాలుగు, ఐదు విజేతలకు బహుమతులు గోనెగండ్ల, మంత్రాలయం జట్లకు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవి, రాజేశ్, ఛత్రపతి శివాజీ యువసేన టీం సభ్యులు పాల్గొన్నారు.

గాలివానకు కూలిన పైకప్పు



గట్టులో కురుస్తున్న వర్షం



గాలివానకు లేచిన వైకుంఠధామం రేకులు

గట్టు: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులతో పాటుగా వర్షం కురిసింది. గాలివానకు వైకుంఠధామంలోని రేకుల షెడ్డు పైకప్పు గాలికి ఎగిరి పోయింది. గతంలో కంటే కాస్త ఎక్కువగానే ఎండలు మండుతుండడంతో జనాలు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడడంతో జనాలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఉరుములు, మెరుపులు, గాలులు ఆందోళన కల్గిస్తున్నాయి. ముందస్తు వర్షాలకు మెట్ట భూములు దుక్కిదున్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధు లు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలి

రాజోళి: మండలంలో వర్షాలు కురిసి వాగులు రోడ్లెక్కక ముందే వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రానికి తక్కువ దూరంతో వెళ్లే అవకాశాలున్న పలు గ్రామాలు నుంచి చుట్టూ తిరిగి దూరబారం ప్రయాణించాల్సి వస్తుందని ప్రజలు పేర్కొన్నారు. మండంలోని ముండ్లదిన్నె-రాజోళి, మాన్‌దొడ్డి-తుమ్మిళ్ల, మాన్‌దొడ్డి, నౌరోజీ క్యాంపు, తుమ్మిళ్ల-అశోక్‌నగర్ క్యాంపుల మధ్య వాగులు, చిన్నపాటి వంకలు ఉండటంతో వర్షం కురిస్తే అవి రోడ్డెక్కి ప్రవహిస్తాయని, దాని వల్ల వాహనాల రాకపోకలు నిలిచిపోతాయని తెలిపారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం కావడంతో బ్రిడ్జి నిర్మాణంపై కదలిక రాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా నిర్మాణం చేపడితే ప్రజలు ప్రమాదాలు ఏర్పడకుండా, ప్రయాణం సులు వుగా ఉంటుందని తెలిపారు.

విగ్రహావిష్కరణ పోస్టర్ విడుదల



గట్టులో పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గట్టు: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం నాయకులు విడుదల చేశారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 30న ఆవిష్కరించనున్నట్లు నాయకులు తెలిపారు. ప్రొఫెసర్ కాశీం ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. విగ్రహా విష్కరణకు అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యువకులు, మేధావులు తరలి వచ్చి విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మారెన్న, గోపాల్, ప్రభు, బ్యాంకు మారెన్న, రామకృష్ణ, బస్వరాజు, ఖాసీమన్న, మహేష్ రాముడు, ఫ్రాన్సిస్, చిన్నన్న, ఆదాం, లాజర్ పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతలను పూడ్చండి



మానవపాడు-చెన్నిపాడు మధ్య గుంతల రోడ్డు

మానవపాడు: కొన్ని ఏళ్లుగా గుంతల రోడ్లతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. గుంతల రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండల కేంద్రం నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు రోడ్ల గుండా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బిక్కుబిక్కు మంటూ ప్రయాణం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చి వేయాలని, లేదంటే వర్షాకాలంతో వాహనదారులకు, ప్రజలకు ఈ రోడ్డు గుండా ఇబ్బందులు తప్పవని, అధికారులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికులతో వాగ్వాదం



పనులను అడ్డుకుంటున్న కాలనీవాసులు

అమరచింత: పట్టణంలోని మూడో వార్డులో గల కాళికామాత ఆలయ ఆవరణలో నాలుగు రోజులుగా నిలిచిన వర్షపు నీటిని మళ్లించడానికి వచ్చిన మున్సిపల్ కార్మికులతో కాలనీ వాసులు వాగ్వాదానికి దిగారు. దేవాలయం పక్కనే ఉన్న మురుగు పరిస్థితితో పాటు వర్షపు నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కరం చూపాలని తాత్కాలికంగా పనులు చేసి వెళ్లిపోతే ఎలా అని కార్మికులు చేస్తున్న పనులను అడ్డుకున్నారు. నాలుగు రోజులుగా సమస్యపై పత్రికల్లో వస్తున్న వార్తలపై మున్సిపల్ అధికారులు ఆదివారం తమ పారిశుద్ధ్య కార్మికులతో వాటిని పూర్తి చేయడానికి వచ్చారు.

శాశ్వత పరిష్కారం కావాలి..

తమ వార్డులోని మురుగు ముందుకు వెళ్లలేక కుంటను తలపిస్తుందని శాశ్వతంగా పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ విజయరాములు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఇప్పటి వరకు పట్టణంలోని వార్డులలో ఎలాంటి సమస్యలు ఉన్నాయే అన్న విషయాలను సైతం గుర్తించలేదని వాపోయారు. తమ వార్డు ప్రజల కోరిక మేరకు శాశ్వత పరిష్కార పనులు చేపట్టాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళనలు చేస్తామన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



మదనాపురం మండలం దుప్పల్లిలో..

మదనాపురం: ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు అవ్వాలని పూర్వ ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి అన్నారు. మండలంలోని దుప్పల్లిలో ఆదివారం 2003–04 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాడు పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ వృత్తిలో స్థిరపడ్డ అంశాలపై వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆదర్శంగా నిలవాలన్నారు. ఎవరూ అధైర్య పడకుండా చేస్తున్న పనిని నమ్మకంగా కొనసాగిస్తూ మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. నాడు పాఠశాలలో చదువుకుని కలిసి ఉన్నట్టుగానే ఎప్పటికీ అలాగే ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరుణాకర్, హుస్సేన్‌రెడ్డి, ఖాజన్‌గౌడ్, నిస్సార్, నిర్మల, సరిత, రాధిక పాల్గొన్నారు.

డిగ్రీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెబ్బేరు రూరల్: వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1990–93 విద్యా సంవత్సరంలో డిగ్రీ చదువుకున్న విద్యార్థులు ఆదివారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగానాయక స్వామి ఆలయం వద్ద ఒకే వేదికపై కలుసుకున్నారు.

సమస్యలు పట్టించుకునేదెవరు?

- పైపాడు మున్సిపాలిటీలో చేరినా.. కనీస వసతులు కరువు
- ముక్కుపిండి పన్ను వసూలు
- డ్రెయినేజీలు, వీధిలైట్లకు నోచుకోని కాలనీలు
- సమస్యలపై మొరపెట్టుకున్నా.. పరిష్కారం కాలే..
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పైపాడు బీసీ కాలనీలో డ్రెయినేజీ లేక మురుగు తీస్తున్న యువకుడు

శాంతినగర్: మున్సిపాలిటీ కలిస్తే గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆశించిన పైపాడు ప్రజలకు నిరాశే మిగిలింది. గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఇంటి పన్ను తక్కువ ఉండి మౌలిక సదుపాయాలు కల్పించే వారు. మున్సిపాలిటీ అయినా సమస్యలు పరిష్కారం కాలేదు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో పైపాడు గ్రామాన్ని 2009లో విలీనం చేశారు. అప్పట్లో గ్రామ పంచాయతీగా ఉన్న పైపాడు మున్సిపాలిటీలో కలిపితే పొలాలకు, ప్లాట్లకు డిమాండ్ వస్తుందని, గ్రామంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి అవుతుందని ప్రజలు ఆశించారు. మున్సిపాలిటీ ఏర్పడి నాలుగేళ్లయినా అభివృద్ధి పనులు చేపట్టడం లేదు, కనీసం డ్రెయినేజీలు నిర్మించడం లేదు, వీధి లైట్లు ఏర్పాటు చేయడం లేదు. పూర్తి స్థాయిలో నీటి సౌకర్యం కల్పించలేకపోతున్నారని 1,2 వార్డుల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌లు స్పందించి పైపాడులో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో కల్పించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు..

గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి రాయచూర్ రోడ్డు వరకు గుంతలమయమైన బీటీ రోడ్డు, భీమిరెడ్డి గుడి నుంచి ఈశ్వరాంబ దేవాలయం వరకు అధ్వానంగా ఉన్న రోడ్లు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.



సమస్యలపై మున్సిపల్ చైర్ పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు (ఫైల్)

డ్రెయినేజీ కాల్వలు లేక అవస్థలు..

కుర్వ చంటెన్న ఇంటి ముందు నుంచి ప్రధాన రహదారి వరకు, బోయ సోమన్న ఇంటి ముందు, వెనకవైపు. బంగారు నాగన్న ఇంటి వెనకవైపు, బోయ గోపాల కృష్ణ ఇంటిముందు, స్వర్గీయ బోయ పెద్ద ఈదన్న ఇంటి ముందు డ్రెయినేజీ కాల్వలు నిర్మించకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు ప్రవహిస్తూ కాలినడకన బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.

వీధి దీపాలు వెలగక..

పైపాడులోని ప్రతి స్తంభానికి గతంలో వీధి దీపాలు వేశారు. వాటిలో కొన్ని వీధిలైట్లు వెలగడంలేదు. కొంతకాలంగా వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళల్లో బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొందని పైపాడు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్ నుంచి రాత్రి వేళల్లో కాలినడకన పైపాడుకు చాలామంది వెళ్తుంటారు. రోడ్డు వెంట వీధి దీపాలు అమర్చకపోవడంతో ఇబ్బందికరంగా ఉంటుందని, విషసర్పాలు సంచరిస్తుంటాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి పన్ను వసూలు..

మౌలిక వసతులు కల్పించకున్నప్పటికి ఇంటి పన్ను మాత్రం బలవంతంగా వసూలు చేస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో వందల్లో ఇంటి పన్ను చెల్లించగా, మున్సిపాలిటీ అయిన తరువాత ఏకంగా వేళల్లో ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి..



శాంతినగర్‌కు ప్రతినిత్యం పైపాడు వాసులు వందలమంది వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటాం. శాంతినగర్‌కు కిలోమీటర్ దూరంలో మా గ్రామానికి రవాణా సౌకర్యం లేదు. కొందరు మోటార్ సైకిళ్లపై వెళ్తుంటారు. మరికొందరు కాలినడకన వెళ్తారు. పైపాడు స్టేజీ నుంచి పైపాడు వరకు పూర్తి స్థాయిలో వీధిలైట్లు ఏర్పాటు చేసి పాదాచారులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.

– బోయ వెంకటేశ్వర్లు, పైపాడు

డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలి..



పైపాడులోని 1,2 వార్డుల్లో చాలా చోట్ల డ్రెయినేజీ కాల్వలు ఏర్పాటు చేయలేదు. వానాకాలంలో మట్టి కాల్వలు పూడుకుపోయి రోడ్లపైన మురుగు నీరు ప్రవహిస్తూ ఇబ్బందిగా ఉంటుంది. మురుగు కాల్వల్లో నీరు నిలిచి కంపు కొడుతూ ఇళ్లలో ఉండలేని పరిస్థితి. దోమలు, పందులు వల్ల రోగాల బారిన పడుతున్నాం. వెంటనే డ్రెయినేజీ నిర్మించి రోగాల బారిన పడకుండా చూడాలి.

– సంజన్న, పైపాడు

సీసీ రోడ్లు వేయాలి..



భీమిరెడ్డి గుడి నుంచి ఈశ్వరాంబ దేవాలయం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. కాలినడకన వెళ్లే వారు ఈ దారిగుండా శాంతినగర్‌కు వెళ్తుంటారు. రోడ్డు గుంతలమయంగా ఉంది. వర్షాకాలంలో నీరు నిలిచి గుంతల్లో ప్రయాణం చేయలేని పరిస్థితి ఉంది. సీసీ రోడ్డు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి.

– శివుడు, పైపాడు